# ఒక్కరోజే 57మంది మృతి

## చైనాలో ఇంకా ఆందోళనకర పరిస్థితి-భారత్‌లో మూడో కేసు నమోదు

బీజింగ్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): చైనాలో కరోనా బారిన పడి ఆదివారం ఒక్కరోజే 57 మంది మృత్యువాత పడ్డారు. దీంతో మరణించిన వారి సంఖ్య 361కి చేరింది. మరో 17,205 మందికి ఈ వైరస్ సోకినట్లు నిర్ధరించారు. ఒక్కరోజులో 2,829 కొత్త కేసులు నమోదయ్యాయి. వీరిలో 186 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఇప్పటి వరకు 475 మంది వైరస్ నుంచి కోలుకున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. మరో 1,89,583 మంది అనుమానితుల్ని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. మరోవైపు 1000 పడకలతో వుహాన్‌లో నిర్మించిన ప్రత్యేక ఆస్పత్రి సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చింది.

మరోవైపు ఇటు భారత్‌లో కేరళలో రెండో కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ నేతృత్వంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. వైరస్‌ని ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న జాగ్రత్తల్ని సమీక్షించారు. ప్రజలు చైనా ప్రయాణాల్ని మానుకోవాలని కోరారు. అలాగే చైనా నుంచి వచ్చే వారిని తప్పనిసరిగా వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని నిర్ణయించారు. ఇప్పటికే రెండు విడతల్లో వుహాన్‌లో ఉన్న భారతీయులు దిల్లీకి చేరుకున్న విషయం తెలిసిందే. ------------------------


నేటినిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 4-2-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 162 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# మైక్రోస్కోప్‌ల తయారీ పెరగాలి

## పరిశోధనలకు అవే మూలం : గవర్నర్



హైదరాబాద్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): దేశీయంగా మైక్రోస్కోప్‌ల తయారీ విస్తృతంగా పెరగాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ 12వ ఆసియా మైక్రోస్కోపిక్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. దేశీయంగా మైక్రోస్కోప్‌ల తయారీ పెరగాలన్నారు. సునిశిత పరిశీలన, పరిశోధనలకు మైక్రోస్కోప్‌లు ఎంతగానో దోహదపడతాయని గవర్నర్ తెలిపారు. మనిషి అపోహలను, మూఢ నమ్మకాలను మైక్రోస్కోప్ తుడిచిపెట్టిందని గవర్నర్ గుర్తుచేశారు. కంటికి కనిపించని పరిమాణంలో ఉన్న జీవుల్ని విజువలైజ్ చేసే పరిజ్ఞానం మైక్రోస్కోప్‌లదని ఆమె వెల్లడించారు. ప్రపంచం ఈ విధంగా అభివృద్ధి సాధించిందంటే మూలకారణం మైక్రోస్కోపేనని గవర్నర్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో భారత సైంటిస్టులతో పాటు ఆసియా దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు

# ఒకే కుటుంబంలో నలుగురు మృతి

## భర్త విషం కలిపాడని అనుమానం

భోపాల్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): ఒకే కుటుంబంలో నలుగురు అనుమానాస్పదంగా చనిపోయిన సంఘటన మధ్యప్రదేశ్‌లోని అకల్‌పూర్ ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మి బాయ్, ఆమె కూతుళ్లు ముగ్గురు విగతజీవులై కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు.

పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలపై ఎక్కడ గాయాలు లేవని తెలిపారు. ఈ నలుగురిని హత్య చేశారా? లేక వీళ్లు ఆత్మహత్య చేసుకున్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మి బాయ్ భర్త కనిపించకపోవడంతో అతడిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబం తినే భోజనంలో ఆమె భర్త విషం కలిపి చంపి ఉంటాడని అనుమాన వ్యక్తం చేస్తున్నారు. శవ పరీక్షలో అన్ని బయటపడుతాయని పోలీసులు వెల్లడించారు.

# మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం

## పెళ్లికి వస్తుండగా ఢీకొన్న ట్రక్కు: పదిమంది మృతి

ముంబయి,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలోని జలగావ్ జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. యావల్ తాలుకాలోని హింగోలా గ్రామ సమీపంలో ఎస్‌వీయూ వాహనాన్ని ఓ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారిగా తెలుస్తోంది. మృతుల్లో ప్రభాకర్ నారాయణ్ చౌదరి, ఆయన భార్యతో పాటు 8 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో 10 సంవత్సరాల అమ్మాయి ఉంది. మహారాష్ట్రలో వారం రోజుల వ్యవధిలోనే ఈ ప్రమాదం రెండోది. జనవరి 25వ తేదీన మహారాష్ట్రకు చెందిన ఆర్టీసీ బస్సు - ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 26 మంది ప్రాణాలు కోల్పోగా మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు.



మహారాష్ట్రలోని జలగావ్ జిల్లా యావల్ తాలుకాలోని హింగోలా గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ఎస్‌వీయూ వాహనం

# కేరళలో మరో వ్యక్తికి కరోనా వైరస్

## చైనా నుంచి వచ్చిన వ్యక్తికి వ్యాధి లక్షణాలు

### చికిత్స చేస్తున్న వైద్యులు

తిరువనంతపురం,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): భారత్‌లో కరోనా వైరస్ మూడో కేసు నమోదైంది. కేరళలోని కాసర్‌గఢ్‌లో ఓ వ్యక్తికి వైరస్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. కరోనా వైరస్ సోకిన బాధితుడు.. ఇటీవల వూహాన్ నుంచి కేరళకు చేరుకున్నాడు. అయితే బాధిత వ్యక్తి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కేరళ ఆరోగ్య శాఖ మంత్రి కే కే శైలజ ప్రకటించారు. తొలి రెండు కేసులు కూడా కేరళలోనే నమోదు అయ్యాయి. మొదటి ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కేరళ ప్రభుత్వం తెలిపింది. ఇక కరోనా వైరస్ బారిన పడి చైనాలో 361 మంది మృతి చెందారు. ఈ వైరస్ వ్యాప్తి వల్ల 9,618 మంది ఆస్పత్రిలో చేరారు. 478 మంది ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం ఈ వైరస్ భారత్, అమెరికా, యూకేతో పాటు మొత్తం 25 దేశాలకు విస్తరించింది. కరోనాను కట్టడి చేసేందుకు చైనా పటిష్ఠమైన చర్యలకు ఉపక్రమించింది. వైరస్ సోకిన బాధితులను ప్రత్యేక ప్రాంతాల్లో ఉంచుతూ ఇతరులతో కలువకుండా గట్టి చర్యల్ని తీసుకుంటున్నది. ఇంకోవైపు, వ్యాధి ప్రభావిత ప్రాంతాలైన వుహాన్, వెన్‌జౌ లాంటి నగరాల్లో అధికారులు నిషేధాజ్ఞలు విధించారు. నిత్యావసర సరుకులను కొనుగోలు చేయడం కోసం ప్రతి ఇంటి నుంచి ఒక్క సభ్యున్ని మాత్రమే అధికారులు బయటకి అనుమతిస్తున్నారు. అదికూడా రెండ్రోజులకు ఒకసారి మాత్రమే. అధికారుల నిషేధాజ్ఞలతో ఆదివారం వెన్‌జౌ నగరంలోని రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. 46 హైవే టోల్ స్టేషన్లను అధికారులు మూసివేశారు. మెట్రో రైలు సేవలు, ప్రజా రవాణాను తాత్కాలికంగా నిలిపివేశారు. ఇప్పటివరకూ ఈ నగరంలో 265 మందికి వైరస్ సోకినట్టు అధికారులు గుర్తించారు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో తరగతుల్ని మార్చి 1 వరకు ప్రారంభించవద్దని అధికారులకు సూచించారు. ఫిబ్రవరి 17వరకు వ్యాపార సముదాయాలు మూసి ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు.

# గాంధీలో ఐసోలేషన్ వార్డు ప్రారంభం

## కరోనా వైద్యపరీక్షలు ప్రారంభించిన మంత్రి ఈటెల

### తెలంగాణలో కేసులు నమోదు కాలేదని వెల్లడి

హైదరాబాద్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): తెలంగాణఇప్పటి వరకు కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాలేదని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. గాంధీ ఆసుపత్రిలో కరోనా వైరస్ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు.

ఈ మేరకు సోమవారం ఆయన లాంఛనంగా టెస్టును ప్రారంభించి గాంధీ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలను ప్రారంభించారు. అలాగే గాంధీ ఆస్పత్రిలో వైరాలజీ ల్యాబ్‌ను మంత్రి ఈటల రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. నిన్నటి వరకు జరిపిన టెస్టుల శాంపిల్స్‌ను పుణెకు పంపించామన్నారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటారని మంత్రి ఈటల వెల్లడించారు. అలాగే మంత్రి తలసానితో కలసి గాంధీ మెడికల్ కాలేజీ లైబ్రరీ బిల్డింగ్‌ను ప్రారంభించిన మంత్రి ఈటల.. ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డును పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గాంధీ మెడికల్ కాలేజీలో నేటి నుంచి కరోనా పరీక్షలను వైద్యులు చేస్తారని తెలిపారు. గంటల్లోనే ఫలితాలు వస్తాయన్నారు. కరోనా వైరస్ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో విజృంభిస్తుందన్నారు. చైనా నుంచి వచ్చే వారిని కేంద్రం స్క్రీనింగ్ చేస్తోంది. కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. కరోనా వైరస్ పట్ల తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు.

తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఇక్కడే వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. ఇక చైనా నుంచి వచ్చిన వ్యక్తులను 24 గంటలపాటు అబ్జర్వేషన్‌లో ఉంచుతామని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే ఛాతీ, ఫీవర్ ఆస్పత్రుల్లోనూ ఐసోలేషన్ వార్డులను ప్రారంభించామని మంత్రి గుర్తు చేశారు. ఈ మూడు ఆస్పత్రుల్లో 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉంటారు. అనుమానిత వ్యక్తుల శాంపిల్స్‌ను పుణెకు పంపించాం.. ఆ రిపోర్టులో కరోనా వైరస్ లేదని తేలిందన్నారు. గత పది రోజులుగా శాంపిల్స్‌ను పుణెకు పంపుతున్నాం. ఇప్పుడు ఆ అవసరం లేదు. ఇప్పుడు గాంధీ ఆస్పత్రిలోనే కరోనా నిర్ధారణ పరీక్షలు ప్రారంభించామని తెలిపారు. కరోనా వైరస్ నిర్ధారణ కోసం కిట్‌లను కేంద్రం పంపిణీ చేసిందన్నారు. ల్యాబ్‌లో కిట్స్, మ్యాన్‌పవర్ అన్ని అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణలో ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాలేదు అని మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# జామియాలో మరోమారు కాల్పుల కలకలం

## స్కూటీపై వచ్చి అర్ధరాత్రి కాల్పులకు తెగించిన దుండగులు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): జామియా మిలియా యూనివర్సిటీలో ఆదివారం అర్ధరాత్రి మరోసారి కాల్పుల కలకలం చెలరేగింది. దీంతో కాసేపటివరకు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఢిల్లీలోని విశ్వవిద్యాలయం ఎదుట విద్యార్థులు పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తుండగా కొంతమంది దుండగులు స్కూటీపై వచ్చి కాల్పులకు పాల్పడ్డట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. తొలుత గేట్ నంబర్ 5 దగ్గర, తర్వాత గేట్ నంబర్ 1 వద్ద వారు ÷రిరగ్ జరిపినట్లు వెల్లడించారు. ఈ కాల్పుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని సమాచారం. ఘటనపై జామియా యూనివర్సిటీ సెక్యూరిటీ గార్డులు.. అధికారులకు సమాచారమిచ్చారు. ఓక్లా నుంచి వచ్చిన స్కూటీ జుల్లెనా వైపు వెళ్లినట్లుగా గుర్తించారు. దుండగుల్లో ఒకరు రెడ్ జాకెట్ ధరించారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా తమకు ఎలాంటి ఖాళీ బు÷-లలెట్లు దొరకలేదని తెలిపారు. దుండగులను గుర్తించడానికి ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామన్నారు. కాగా నాలుగు రోజుల వ్యవధిలో జామియా మిలియా యూనివర్సిటీ ప్రాంతంలో కాల్పులు జరగడం ఇది మూడోసారి.

# కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తా : జూపల్లి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 3: తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. జూపల్లి కృష్ణారావు పార్టీ మారుతున్నారని గత కొద్ది రోజుల నుంచి మీడియాలో వస్తున్న కథనాలను ఆయన కొట్టిపారేశారు.

తనకు పార్టీ మారే ఆలోచన లేదని.. సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తున్నాను.. పని చేస్తానని జూపల్లి ఉద్ఘాటించారు. తనంటే గిట్టని కొంతమంది తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తమదంతా టీఆర్ఎస్ కుటుంబమేనని జూపల్లి తేల్చిచెప్పారు. కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందింది అని తెలిపారు. అసెంబ్లీ, స్థానిక, మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు తిరుగులేని ఫలితాలు వచ్చాయన్నారు. కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలకు ఉనికి లేకుండా పోయిందన్నారు జూపల్లి. తాను పూటకో పార్టీని మార్చే వాడిని కాదన్నారు. మంత్రి పదవి వదులుకొని రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్నాను అని జూపల్లి కృష్ణారావు గుర్తు చేశారు.

# సిఎఎ,ఎన్ఆర్‌సిలపై సభలో గందరగోళం

## లోక్‌సభలో ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన

### రాజ్యసభలోనూ రగడ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): పౌరసత్వ సవరణ బిల్లు (సీఏఏ), జాతీయ పౌరుల జాబితా (ఎన్ఆర్‌సీ)లపై లోక్‌సభలో ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన చేపట్టాయి. బ్జడెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం లోక్‌సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్ సహా ప్రతిపక్షాల సభ్యులు షేమ్.. షేమ్.., సేవ్ ఇండియా, సేవ్ డెమోక్రసీ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీంతో ఎవరేమి మాట్లాడుతున్నారో అర్థంకాక గందరగోళం నెలకొంది. సీఏఏ, ఎన్నార్సీలపై చర్చకు కాంగ్రెస్, బీఎస్పీ, వామపక్షాలు పట్టుబట్టాయి. తృణమూల్ కాంగ్రెస్ ) సభ్యులు సైతం ప్రతిపక్షంతో గొంతు కలిపారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై జరుగుతున్న చర్చను ప్రతిపక్ష సభ్యులు పదే పదే అడ్డుకున్నారు. విపక్ష సభ్యుల మధ్యే ప్రస్తుతం చర్చ కొనసాగింది. మరోవైపు రాజ్యసభలోనూ తీవ్ర గందరగోళం నెలకొనడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదా వేశారు.

అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యలపై గందరగోళం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర ఆర్థిక సహాయమంత్రి అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో ఇవాళ ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఆయన మాట్లాడేందుకు నిలబడిన ప్రతిసారీ... గోలీ మంత్రి.. గో బ్యాక్.. అంటూ ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు. కాల్పులు ఆపండి.. అంటూ డిమాండ్ చేశారు. దీంతో సభ్యుల అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు మంత్రి ఇబ్బందిపడాల్సి వచ్చింది. ఇటీవల కేంద్రమంత్రి ఠాకూర్ ఓ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ.. సీఏఏకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. సీఏఏను వ్యతిరేకిస్తున్న వారు దేశద్రోహులనీ.. వారిని కాల్చిపారేయాలంటూ ఠాకూర్ పేర్కొన్నారు. దేశ్ కే గద్దారోంకో అంటూ మంత్రి నినాదం ఇవ్వగానే.. అక్కడ ఉన్న జనం అంతా గోలీ మారో అంటూ నినాదాలు చేశారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించడంతో.. ఆయన ప్రచారంపై మూడు రోజుల పాటు నిషేధం విధించారు. కాగా మంత్రి ఠాకూర్ ఈ వ్యాఖ్యలు చేసిన నాటి నుంచి ఇప్పటికి మూడు సార్లు సీఏఏ నిరసనకారులపై కాల్పులు జరగడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలోనే సభలో ప్రతిపక్షాలు మంత్రి వ్యాఖ్యలపై తీవ్ర నిరసన చేపట్టాయి.

# ముగిసిన మాజీ ఎంపీ నారాయణరెడ్డి అంత్యక్రియలు

నిజామాబాద్ , ఫిబ్రవరి 3: తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు, రైతునేత, మహిళా అభ్యుదయవాది, నిజామాబాద్ మాజీ ఎంపీ ముస్కు నారాయణరెడ్డి అంత్యక్రియలు అధికార లాంఛనాలతో ముగిశాయి. ధర్మారంలోని కృషి దర్శన్ కేంద్రంలో నారాయణరెడ్డి అంత్యక్రియలను నిర్వహించారు. నారాయణరెడ్డి అంత్యక్రియలకు శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, మేయర్ నీతూ కిరణ్, జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, మాజీ స్పీకర్ సురేశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, పోలీసు కమిషనర్ కార్తికేయతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ ముస్కు నారాయణరెడ్డి (89) నిన్న కన్నుమూసిన విషయం విదితమే. ఆరుదశాబ్దాలపాటు తెలంగాణనే శ్వాసగా జీవించిన ఆయన ఆదివారం ఉదయం నిజామాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందారు. శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న నారాయణరెడ్డి రెండురోజుల క్రితం దవాఖానలో చేరా రు. తాను స్థాపించిన ఉమెన్స్ కళాశాల రిటైర్డ్ అధ్యాపక బృందం ఆధ్వర్యంలో ఆదివారం ఆయనకు పౌరసన్మానం ఏర్పాటుచేశారు. అస్వస్థతతో ఉన్నప్పటికీ వైద్యుల అనుమతితో ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు సమాయత్తమవుతున్న తరుణంలోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. మోర్తాడ్ మండలం సుంకెట్‌లో పటేల్‌రెడ్డి, లక్ష్మీబాయి దంపతులకు 1931 సెప్టెంబర్ 10న నారాయణరెడ్డి జన్మించారు. ఆయనకు సతీమణి పద్మావతి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



నారాయణరెడ్డి పార్థివానికి నివాళులర్పిస్తున్న నేతలు..

# దిశ ఎన్‌కౌంటర్‌పై విచారణ

## -హైదరాబాద్ చేరుకున్న జ్యుడిషియల్ కమిటీ

హైదరాబాద్,ఫిబ్రవరి3(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'దిశ' కేసు వ్యవహారం మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ కేసులో సుప్రీంకోర్టు వేసిన జ్యుడీషియల్ కమిటీ హైదరాబాద్ చేరుకుంది.

ఈ కమిటీ హైకోర్టులో విచారణ చేయనున్నది. ఇటీవలే దిశ కేసులో ముగ్గురు సభ్యులతో కమిషన్‌ను సుప్రీంకోర్టు వేసిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ జడ్జితో పాటుగా న్యాయవాది సీబీఐ మాజీ డైరెక్టర్‌లతో కమిషన్ వేయడం జరిగింది. హైకోర్టు ప్రాంగణం నుంచే ఈ కమిషన్ కార్యకలాపాలు నిర్వహించనున్నది.

కాగా.. ఇప్పటికే కేసు డైరీలను తెప్పించుకున్న కమిషన్ నిశితంగా పరిశీలించింది. అలాగే ఎన్‌కౌంర్ మృతుల రీపోస్ట్‌మార్టమ్‌ను కూడా కమిటీ పరిశీలించనుంది. అలాగే పోలీస్ అధికారులతో పాటు, వివిధ వర్గాల నుంచి సమాచారం సేకరించనున్నారు. జ్యుడీషియల్ కమిటీలో మాజీ న్యాయమూర్తి సిర్పూర్ కర్, సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్, బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి రేఖ ప్రకాష్ సభ్యులుగా ఉన్నారు. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ కేసులో నిందితుల ఎన్ కౌంటర్ పై కమిటీ వేసింది సుప్రీం కోర్టు. ఎన్ కౌంటర్ కు సంబంధించిన వివరాలపై ఈ కమిటీ ఆరా తీయనుంది. హైకోర్టు సీ బ్లాక్ లో కమిటీ ఉండనుంది. కమిటీ సభ్యులకు అన్ని ఏర్పాట్లు చేసింది రాష్ట్ర ప్రభుత్వం.

నిందితుల పోస్టుమార్టం, రీ పోస్టుమార్టం రిపోర్ట్‌ను జ్యుడీషియల్ కమిటీ పరిశీలించనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ నుంచి వివరాలు కమిటీ తీసుకోనుంది.

## చరిత్రలో నేటినిజం



కం॥ అతిమధురమైన సరళమైన
శ్రుతిలో గానమ్ము జేయు సన్మాన్యుని - "భా
రతరత్న"ము బూజించెద
స్తుతిపాత్రుని "భీమసేన జోషి"ని సతతమున్ !!

(ఫిబ్రవరి 4 భీమసేన్ జోషి జయంతి)



-రాధశ్రీ
సెల్: 9494481210

